క్లుప్తంగా

డ్రగ్స్ నియంత్రణపై అవగాహన


మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని విక్రమ్ జూనియర్ కళాశాలలో సోమవారం డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకోవడం వల్ల జీవితాలు అంధకారం అవుతాయన్నారు. అమ్మినా సేవించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఇన్‌స్పెక్టర్ దశరథరామిరెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు తొలగింపు


కోబాకలో మురుగును తొలగిస్తున్న కూలీ

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు, కోబాక పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, బుజ్జమ్మ ఆధ్వర్యంలో సోమవారం మురుగునీటి కాలువల్లో మురుగు తొలగించి శుభ్రం చేశారు. తొలకరి జల్లులు పడుతుండడంతో దోమలు చేరి మలేరియా, విషజ్వరాలు సంభవించే ప్రమాదం ఉండడంతో సర్పంచ్‌లు ముందస్తు చర్యల్లో చేపట్టారు. కాలువల్లో మురుగును తొలగించి కొళాయిలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద బ్లీచింగ్ ఏర్పాటు చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. నీటి తొట్టెలు, గుంతల్లో నీటిని నిల్వ ఉంచరాదని అవగాహన కల్పించారు.

ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. తిరుపతికి చెందిన గుణశేఖర్(42), మునస్వామి (38) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళ్తుండగా అంజిమేడు వద్ద ముందు వెళ్తున్న లారీని అధిగమించబోయి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం ప్రైవేట్ వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి మోటారు మరమ్మతులు


మోటారుకు మరమ్మతులు చేస్తున్న ఎలక్ట్రీషియన్

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో సోమవారం తాగునీటి మోటారు మరమ్మతులు జరిగాయి. రెండు రోజుల కిందట మోటారు మరమ్మతులకు గురైంది. గ్రామస్తులు సమస్యను సర్పంచ్‌కు విన్నవించారు. వెంటనే స్పందించిన సర్పంచ్ మోటారుకు మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను పరిష్కరించారు. గ్రామస్తులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయండి


ఆదిమూలంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభావతి

నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలో డ్వాక్రా సంఘాల మహిళా సభ్యులు ఆర్థికంగా బలపడే దిశగా కృషి చేయాలని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సూచించారు. సోమవారం సాయంత్రం డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి ఆదిమూలంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభావతితో పాటు డీఆర్‌డీఏ సిబ్బంది, స్థానిక వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు


రేణిగుంటలో డ్రగ్స్ గురించి అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రేణిగుంట: మత్తుకు బానిసై జీవితాలను బుగ్గిపాలు చేసుకోవద్దని రేణిగుంట డీఎస్పీ భవ్య కిషోర్ అన్నారు. రేణిగుంటలోని నారాయణ జూనియర్ కళాశాలలో సోమవారం యాంటీ డ్రగ్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ఎవరూ మత్తుకు అలవాటు పడకుండా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ గురించి వివరించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో రేణిగుంట సీఐ మల్లికార్జున, ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


గరుడ గిరిపై బంగారు వర్ణంతో అస్తమిస్తున్న సూర్యుడు

స్వర్ణవర్ణ శోభితం


తిరుమలగిరిని కమ్ముకున్న కారుమబ్బులు

ఆధ్యాత్మిక నగరిలో సోమవారం ఆకాశదేశాన వింత మార్పులు చోటు చేసుకున్నాయి. ఓవైపు నల్ల మబ్బులతో వర్షం కురుస్తుంటే మరోవైపు సాయం సంధ్య వేళ అస్తమిస్తున్న భానుడు గరుడ గిరిపై బంగారు వర్ణంలో శోభించాడు. ఈ అరుదైన దృశ్యాలను చూపరులు తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ , తిరుపతి

దురలవాట్లతో భవిష్యత్తు ప్రశ్నార్థకం


మాట్లాడుతున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ ఇరుకుందమ్మ

నారాయణవనం: చదువుకునే వయసులో దురలవాట్లకు బానిసైతే భవిష్యత్తు ప్రశ్నార్థకంగా, భారంగా మారుతుందని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఇరుకుందమ్మ పేర్కొన్నారు. సోమవారం సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఇరుకుందమ్మ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు ఆకర్షితులై పెడదారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమాజంలో బాధ్యాయుత పౌరునిగా ఎదగడానికి కృషి చేయాలని సూచించారు. సదస్సులో ఏఎస్‌ఐ జయరాం నాయక్, ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్ రెడ్డి, జనార్దనరాజు, రమేష్, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలకు చదువు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ, విద్యార్థినులతో మాట్లాడుతున్న వెంకటరమణ

ఏర్పేడు: బాలికలకు చదువు ఎంతో అవసరమని ప్రగతి సంస్థ డైరెక్టర్ వెంకటరమణ అన్నారు. సోమవారం మండలంలోని పల్లం ఉన్నత పాఠశాలలో బడిఈడు పిల్లలను చేర్పించారు. ఆయన మాట్లాడుతూ బాలికల విద్య పట్ల సామాజిక వైఖరిని మార్చడం, అవగాహన పెంపొందించడానికి సంస్థ కృషి చేస్తున్నట్లు వివరించారు. ఆడపిల్లలను బాగా చదివించాలని సూచించారు. చదువుతోనే ఆర్థిక అక్షరాస్యతను సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆనంద్, లక్ష్మయ్య, ప్రగతిసంస్థ ప్రతినిధులు శిరీష, సుభాష్ చంద్రబోస్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం రూ.20 వేలు చెల్లించాలి

తిరుపతి అర్బన్: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి భరోసాగా ప్రభుత్వం అందిస్తామని హామీ ఇచ్చిన రూ.20 వేలు వెంటనే చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం రైతు సంఘం నేతలతో కలసి ఇన్‌చార్జి కలెక్టర్ ధ్యానచంద్ర.హెచ్ఎంకు వినతిపత్రాన్ని అందించారు. పెట్టుబడి సాయం సకాలంలో అందించకపోతే రైతులు అప్పులు చేసి పెట్టుబడులు తెచ్చుకోవాల్సి ఉందని వెల్లడించారు. కొందరు రైతులకు అప్పులు చేయడానికి అవకాశం లేకపోవడంతో సేద్యం చేయలేక భూములు బీడు పెట్టాల్సిన దుస్థితి నెలకొంటుందని ఆమె వివరించారు. ఈ క్రమంలో రైతులతోపాటు కౌలు రైతులకు అండగా ఉండాలని కోరారు. అంతేకాకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరోవైపు బ్యాంక్‌ల నుంచి రైతులకు అందాల్సిన క్రాప్ రుణాలు జాప్యం లేకుండా ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వివరించారు. అంతేకాకుండా గతంలో చెరకు రైతులకు ఫ్యాక్టరీల యజమానులు బకాయిలు ఉన్నారని వాటిని చెల్లించాలని కోరారు. ఆ మేరకు ఓ వినతిపత్రాన్ని అందించారు. ఆమెతోపాటు రైతు సంఘం నేతలు పురుషోత్తంరెడ్డి, పి.భాస్కర్ నాయుడు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే వంతెన కింద ఇరుక్కున్న లారీ


రేణిగుంటలో రైల్వే వంతెన కింద ఇరుక్కున్న లారీ

- ఆగిన వాహన రాకపోకలు

రేణిగుంట: రేణిగుంట పాత చెక్‌పోస్ట్ సమీపంలో సోమవారం తిరుపతి వైపు వెళుతున్న ఓ భారీ లారీ రైల్వే వంతెన కింద ఇరుక్కుంది. దీంతో అటువైపు రాకపోకలను సాగిస్తున్న వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దాదాపు అరగంట పాటు వాహనాలు నిలిచిపోయాయి. జేసీబీ సాయంతో వంతెన సమీపంలోని బారికేడ్‌ను తొలగించి ఇరుక్కున్న లారీని వెనక్కు తీశారు. పోలీసులు అక్కడకు చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.


స్తంభించిన వాహనాల రాకపోకలు

సూర్యప్రభపై శ్రీవారి వైభవం



గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో వారం రోజులుగా బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం శ్రీవారు సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి వారి ఉత్సవమూర్తిని సూర్యప్రభపై కొలువుదీర్చి ఊరేగించారు. అనంతరం అర్చకులు స్వామి వారికి లక్ష్మీ సంవాదం, ముసుగుల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా పట్టణానికి చెందిన పలువురు వ్యవహరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ ఈవో నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

సమస్యలపై శ్రద్ధ పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నాగలాపురం: మండలంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, రెవెన్యూ సిబ్బందితో ఎంపీడీఓ పీఎంకే బాబు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పంచాయతీల్లో పారిశుధ్యం, తాగు నీటి సరఫరా, డయేరియా నిర్మూలన మొదలైన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు నరసింహులు, మండల అధికారులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

సత్యవేడు: మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మార్కెట్‌లో మామిడి గుజ్జుతో తయారైన రసాలకు ఏ మాత్రం ధర తగ్గడం లేదని పేర్కొన్నారు.. అయితే రైతుల నుంచి సేకరించే మామిడి కాయల ధర మాత్రం తగ్గించి డిమాండ్ లేదనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతులను నష్టపరిచే విధంగా జ్యూస్ పరిశ్రమల యాజమాన్యాలు రైతులను దోచేస్తుంటే కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమకేమీ పట్టనట్లు ఉండడం సరికాదని వివరించారు. జిల్లా కలెక్టర్ తోతాపురి మామిడి టన్ను రూ.30 వేలకు కొనుగోలు చేయాలని ఆదేశించినా పరిశ్రమల యజమానులు తక్కువ ధరకే కొంటున్నారని ఆరోపించారు.

డ్వాక్రా మహిళల ఇక్కట్లు

రేణిగుంట: డ్వాక్రా మహిళలు తాము పొదుపు చేసుకున్న మొత్తంలో నుంచి లోను రూపంలో నగదు తీసుకునేందుకు బ్యాంకుకు వస్తే బ్యాంకు సిబ్బంది నగదు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని బాధిత మహిళలు వాపోతున్నారు. రేణిగుంటలోని కెనరా బ్యాంకులో డ్వాక్రా సంఘాల మహిళలు దాచుకున్న పొదుపు మొత్తాలను తీసుకునేందుకు వెళ్తే పది రోజులుగా వారం తరువాత రండి అంటూ సిబ్బంది తిప్పి పంపుతున్నారని బాధిత సభ్యులు వాపోతున్నారు. స్కూళ్లు పునఃప్రారంభించిన తరుణంలో తమ పిల్లల స్కూల్ ఫీజుల కోసం ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో అడిగితే బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నరకం చూపుతున్నారని వాపోయారు. సోమవారం కూడా పదుల సంఖ్యలో డ్వాక్రా మహిళలు బ్యాంకుకు వచ్చి నగదు ఇవ్వకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. రేణిగుంటలోని ఏ బ్యాంకులో ఈ సమస్య లేదని, ఇక్కడే ఏమిటని మహిళలు ప్రశ్నిస్తున్నారు. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభం

నాగలాపురం: తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించామని పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టరు కార్యాలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించారు. ఎంపీడీఓ పీఎంకే బాబు, తహశీల్దారు డి.నరసింహులు, అన్ని శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఆలయం కూల్చిన వారిపై చర్యలు తీసుకోండి


మిద్దెల హరి

శ్రీకాళహస్తి: పట్టణంలోని కుందేటి వారి ఎస్టీకాలనీలో యానాదులు నిర్మించుకున్న గ్రామదేవత గంగమ్మతల్లి ఆలయాన్ని కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ మిద్దెల హరి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ వారు భక్తి విశ్వాసాలతో నిర్మించుకుంటే సహకరించాల్సింది పోయి దుర్మార్గంగా ఆలయ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి పునర్నిర్మాణంలో ఉన్న గంగమ్మతల్లి ఆలయాన్ని వెంకటేష్ అనే వ్యక్తి, అతని బావమరిదితో కలిసి కూల్చివేశారన్నారు. వీరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వారు యానాదులకు క్షమాపణ చెప్పి ఆలయాన్ని పునర్నిర్మించకపోతే ధర్నా చేస్తామని తెలిపారు.

వినతులను పరిష్కరించాలి


ప్రజా సమస్యల ప్రజావేదికలో పాల్గొన్న డీటీ చంద్రబాబునాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రీవెన్స్ డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి, పరిష్కరించాలని డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబునాయుడు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల ప్రజావేదికను సిబ్బందితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే రోజున ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, ఈ కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి, తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. మండల సర్వేయర్ వెంకట్రామయ్య, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బడికి రాని పిల్లలపై ప్రత్యేక దృష్టి


వేణుగోపాలపురం గ్రామంలో ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ: బడి మానేసిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎంఈఓ మునిసుబ్రమణ్యం తెలిపారు. సోమవారం మండలంలోని తలారివెట్టు, వేణుగోపాలపురం గ్రామాల్లోని గిరిజన కాలనీలలో బడికి పోతాం ర్యాలీ కార్యక్రమాన్ని ఆయన ఉపాధ్యాయులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని తెలిపారు. బడి మానేసిన పిల్లలను తిరిగి చేర్పించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పురుషోత్తం, రామదాసు, యువశ్రీమురళి, ప్రసాద్, దాసు, సీఆర్‌పీ ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు అరికట్టాలి


పల్లమాల విలేజ్ క్లినిక్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాసరావు

బుచ్చినాయుడుకండ్రిగ: మాతాశిశు మరణాలు సంభవించకుండా పనిచేయాలని జిల్లా వైద్య టాస్క్‌ఫోర్స్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన సోమవారం బుచ్చినాయుడుకండ్రిగలోని పీహెచ్‌సీ, పల్లమాల గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు రక్తహీనతతో మరణించకుండా సిబ్బంది ముందుగా మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. యుక్త వయస్సులో ఉన్న గర్భవతులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి తక్కువగా ఉన్నవారిని గుర్తించి, వారికి మల్టీవిటమిన్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గణాంక అధికారి నాగేంద్రకుమార్, డీపీహెచ్‌ఎన్‌ఓ బేబీరాణి, డీపీఓ ప్రకాష్, వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం


రాచర్లలో మొక్కలు నాటుతున్న క్లీన్ మై విలేజ్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని రియల్ చారిటబుల్ ట్రస్ట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ రెహమాన్ తెలిపారు. అపోలో టైర్స్ ఫౌండేషన్, రియల్ చారిటబుల్ ట్రస్ట్ వారు సంయుక్తంగా రాచర్ల గ్రామ పంచాయతీలో క్లీన్ మై విలేజ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. సోమవారం తడి, పొడి చెత్తను నింపుకోవడానికి చెత్తబుట్టలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామంలో చెట్లను నాటించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్యామ్‌కుమార్, పాఠశాల హెచ్ఎం రాధారాణి, స్థానిక యువత గిరిప్రసాద్, రమేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ స్కామ్‌పై విచారణ చేపట్టాలి



దండి మార్చ్ సర్కిల్ వద్ద పీడీఎస్ఓ నిరసన

తిరుపతి సిటీ: నీట్ పరీక్ష పేపర్ లీకేజీ స్కామ్‌పై తక్షణం సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని పీడీఎస్ఓ విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా కార్యదర్శి ఆర్ ఉష డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మార్ పల్లి దండి మార్చ్ సర్కిల్ వద్ద పీడీఎస్ఓ ఆధ్వర్యంలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులతో కలసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిహార్, గుజరాత్ రాష్ట్రాలలో జరిగిన నీట్ స్కామ్‌పై ప్రధాని నోరు మెదపకపోవడం దారుణమన్నారు. 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలు రోడ్డు పాలు చేయడం ఎంతవరకు న్యాయమని నిలదీశారు. ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని, తిరిగి నీట్ పరీక్షను వెంటనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలనానరు. లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పీడీఎస్ఓ నాయకులు త్రివేణి, సుచిత్ర, పెద్ద సంఖ్యలో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎస్–4లో మరోమారు తనిఖీలు


పీఎస్–4లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ, ప్రజారోగ్య శాఖ అధికారులు

తిరుపతి తుడా: ప్రముఖ పీఎస్–4 హోటల్లో యాత్రికులకు వడ్డించిన ఆహారంలో విషపు జెర్రి వెలుగు చూసిన ఉదంతం సంచలనం సృష్టించింది. దీనిపై ఫిర్యాదులు అందడం, ఫిర్యాదిదారులు, ఘటనను కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాపై దౌర్జన్యానికి దిగిన పీఎస్ 4 హోటల్‌పై మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ఆరోగ్య విభాగం కఠినమైన చర్యలకు దిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పీఎస్–4 హోటల్‌కు రూ.50 వేల భారీ జరిమానా విధించింది. గడిచిన నాలుగు రోజులుగా రెస్టారెంట్‌ను సీజ్ చేశారు. ఈ క్రమంలో తమ ఇకపై ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని యాత్రికులకు నాణ్యమైన వంటకాలు అందిస్తామని హామీ ఇవ్వడంతో పీఎస్–4ను తెరిచేందుకు సోమవారం అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో మరోమారు కిచెన్ పరిసర ప్రాంతాలు, వంటలకు ఉపయోగించే పదార్థాలు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ హోటళ్లలో నాణ్యమైన వంటకాలను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇకపై నాణ్యమైన వంటలను అందిస్తామని హామీ ఇవ్వడంతో కమిషనర్ ఆదేశాల మేరకు పీఎస్–4ను తెరిచేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. నాణ్యమైన వంట సామగ్రి, కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఆయన సూచించారు. పీఎస్–4లో రెండు రోజులకు ఒక మారు పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని, గోడలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, కిచెన్‌లో మూతలు కలిగిన పాత్రలు వాడాలని సూచించామని అన్నారు. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మద్దిలేటి, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి తనిఖీల్లో పాల్గొన్నారు.